క్లుప్తంగా

ఆదర్శవంతంగా నడుచుకోవాలి



తిరుపతి రూరల్: నేడు చేపట్టనున్న ఎన్నికల లెక్కింపు కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు అందరికీ ఆదర్శనీయంగా ప్రవర్తించాలని చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నమస్సులతో కోరారు. కౌంటింగ్ రోజు అందరికీ ఆదర్శంగా, చిన్న గొడవ కూడా జరగకుండా ఓపిక, సహనంతో నడుచుకోవాలని తెలిపారు. ఏ చిన్న సంఘటన జరిగినా కూడా చంద్రగిరి నియోజకవర్గానికి ఒక మచ్చలా మారుతుందని తెలిపారు. పోలీసుల సూచనల మేరకు, ఎన్నికల కమిషన్ నిబంధనలు పూర్తిగా గౌరవిస్తూ సామరస్యంగా, స్నేహభావంతో ప్రవర్తించాలని చేతులు జోడించి నమస్కరిస్తూ కోరుకుంటున్నానని తెలియజేశారు. అవతలి పార్టీ వాళ్లను కూడా ప్రేమ పూర్వకంగా, సోదర భావంతో ఉంటూ ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనాలని తెలిపారు. గత ఐదేళ్లుగా అందరినీ కలుపుకుని వెళుతూ చిన్న గొడవ కూడా లేకుండా ఎంతో హుందాగా వ్యవహరించామన్నారు. కౌంటింగ్ కేంద్రం వెలుపల ఉన్నవారు కూడా అంతే హుందాగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. మంచిగా ఉంటే దేవుడు కూడా మంచే చేస్తారని ఆయన హితవు పలికారు. చిన్న విమర్శ గానీ, ఘటన గానీ జరగకుండా చంద్రగిరి ప్రతిష్టను ఇనుమడింప చేసేలా సౌమ్యులుగా ఉండాలని తనకు ఆత్మీయులు, కుటుంబ సభ్యులైన నియోజకవర్గ ప్రజలకు ఆయన విన్నవించారు.

శాస్త్రోక్తంగా సిద్ధేశ్వరుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ సిద్ధేశ్వర స్వామివారు

భాకరాపేట: తలకోన శ్రీ సిద్ధేశ్వరునికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సోమవారం బహుళ ద్వాదశిని పురస్కరించుకుని వేకువజామున స్వామి, అమ్మవార్లను నిద్ర మేల్కొల్పి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఉపాలయాల్లోని వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, నవగ్రహాలకు పూజలు చేపట్టారు. అభిషేక పూజల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు, కార్యదర్శి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పల్లికొండేశ్వరస్వామికి ప్రదోష పూజలు నేడు



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో ఉన్న సర్వ మంగళ సమేత పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ ఈఓ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామివారికి, మరకదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రదోష పూజల్లో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి, రసీదు పొందాలని తెలిపారు.

పెంచలకోనలో వర్షం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత కొంత కాలంగా ఎండవేడిమికి, ఉక్కపోతకు అల్లాడిన ప్రజలు వర్షం కురవడంతో కొంత ఉపశమనం పొందారు. మండలంలో పలు గ్రామాల్లో వర్షం కురిసింది ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు రావడంతో చల్ల గాలులు వీయడంతో పాటు చిరుజల్లులు పడడంతో వేసవి తాపం నుంచి ప్రజలు ఊరట పొందుతున్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు, బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం పెంచలకోన క్షేత్రంలో వర్షం కురవడం ఆనవాయితీ అని భక్తుల నమ్మకం.

అన్నదానం

నాగలాపురం: మండల కేంద్రంలోని టీటీడీ అనుబంధ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి నాగలాపురం బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ వార్డు సభ్యుడు వి.ఉదయ్ కుమార్ ఉభయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారి ఉదయ్‌కుమార్, సుధ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నగరానికి రాజెవరో..!

తిరుపతి నియోజకవర్గ ఎన్నికల డేటా...		
మొత్తం ఓటర్లు	-	3,02,503
పురుషులు	-	1,49,846
మహిళలు	-	1,52,622
ఇతరులు	-	35
పోలింగ్ ఇలా...		
మొత్తం పోలైన ఓట్లు	-	1,91,557
పురుషులు	-	93,994
మహిళలు	-	97,559
ఇతరులు	-	4
పోలింగ్ శాతం	-	63.32
మొత్తం పోలింగ్ బూత్‌లు	-	274

- ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెర
- అన్ని పార్టీల శ్రేణుల్లో టెన్షన్
- మధ్యాహ్నం 3.50 గంటలకు తేలనున్న తిరుపతి ఫలితం



తిరుపతి తుడా: ఎన్నికల ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలో నిక్షిప్తమైంది. ఆధ్యాత్మిక రాజధాని తిరుపతికి రాజెవరనేది తేలనుంది. పోలింగ్ ప్రక్రియ పూర్తిచేసుకుని, ఫలితం కోసం సుదీర్ఘంగా ఎదురు చూసిన అభ్యర్థులు, పార్టీ శ్రేణుల్లో నెలకొన్న టెన్షన్‌కు ఫుల్‌స్టాప్ పడే సమయం ఆసన్నమైంది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు తిరుపతి నియోజకవర్గ ఎమ్మెల్యే ఎవరు అనేది స్పష్టం కానుంది. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభం కానుంది. 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటిని 14 టేబుల్స్ ద్వారా 20 రౌండ్లలో ఫలితాలను ప్రకటిస్తారు. ఈప్రక్రియ మొత్తం మధ్యాహ్నం 3.50 గంటలకు పూర్తి అవుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితీసింగ్ తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 4,766 మంది ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వీటిని లెక్కించేందుకు ఆరు టేబుళ్లను ఏర్పాటు చేశారు. రెండు రౌండ్లలో పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు వెలువడతాయి.

అభివృద్ధికే పట్టం..!

తిరుపతి నగరం గతంలో ఎన్నడూ లేనంతగా గత ఐదేళ్లలో అభివృద్ధిని సాధించింది. డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన భూమన అభినయరెడ్డి బృహత్తర ప్రణాళికలను రచించి, మరో 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిని పరుగులు పెట్టించారు. తిరుపతి నగర విస్తరణ, కనెక్టవిటీ పెంచడం, నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా 21 మాస్టర్ ప్లాన్ రోడ్లను అతి తక్కువ వ్యవధిలోనే పూర్తి చేయించారు. తద్వార మరో ఐదు వేల ఎకరాల్లో నగరం విస్తరించేందుకు అడుగులు పడ్డాయి. అలానే తిరుపతిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడం, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా చేరుకోవడానికి వీలుగా 9 లింక్ రోడ్లు, 8 ఫ్రీలెఫ్టలను అభివృద్ధి చేయడం వెనుక భూమన అభినయరెడ్డి కృషిని తిరుపతి ప్రజలు మరవలేదని, ఓటు ద్వారా అభివృద్ధికి పట్టం కట్టారన్న అంచనాలు ఉన్నాయి. రాజకీయ విశ్లేషకులు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. అలానే టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు సాధించడం, టీటీడీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంతృప్తికరమైన వేతనాలు పెంచడం, 75 ఏళ్ల శెట్టిపల్లి భూములు సమస్యకు పరిష్కారం చూపడం వంటి అనేక దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో అభినయ్‌రెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారు. ఇవన్నీ కూడా అభినయ్‌కు సానుకూల అంశాలుగా రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

కిక్కిరిసిన తిరునగరి..

తిరుపతి జిల్లా కేంద్రం కావడంతో తొలిసారి జిల్లా వ్యాప్తంగా ఇక్కడే ఓట్ల లెక్కింపు జరుగుతోంది. దీంతో జిల్లా పరిధిలోని తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపు తిరుపతిలోని పద్మావతి వర్సిటీలో చేపట్టనున్నారు. అలానే తిరుపతి పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కూడా తొలిసారి తిరుపతిలోనే చేపడుతున్నారు. దీంతో పోటీలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లు సైతం సోమవారమే తిరుపతికి చేరుకున్నారు. అలానే ముఖ్య కార్యకర్తలు సైతం తిరుపతిలో మకాం వేశారు. దీంతో నగరంలోని అన్ని లాడ్జీలు, హోంస్టేలు, హోటళ్లు నిండిపోయాయి. ఎన్నికల అధికారుల నిబంధనల మేరకు స్థానికులకు మాత్రం అద్దె గదులను ఇచ్చేందుకు నిరాకరించారు.

చంద్రగిరి కోటకు చక్రవర్తి ఎవరో ?



తిరుపతి రూరల్: రాష్ట్రంలోనే కీలక నియోజకవర్గాల్లో ఒకటైన చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం సాధించనుందా? ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాయకత్వంలో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమం, సేవా కార్యక్రమాలకు నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టనున్నారా ? దాదాపు రూ.1050 కోట్లతో నియోజకవర్గంలోని పంచాయతీలను అభివృద్ధి చేసిన చెవిరెడ్డి కుటుంబానికి మరోసారి ప్రజలు అండగా నిలిచారా ? అంటే ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గెలుపు ఖాయమని ప్రకటించాయి.

ఈవీఎంల్లో 2.51 లక్షల మంది తీర్పు...

చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం 3,15,159 మంది ఓటర్లు ఉండగా, మొత్తం 2,51,788 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం 397 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. జిల్లాలోనే అత్యధికంగా పోలింగ్ బూత్‌లు ఉన్న నియోజకవర్గం చంద్రగిరి. ఫలితం త్వరగా ప్రకటించేందుకు టేబుళ్లను 14 నుంచి 20కు పెంచారు. మొత్తం 20 టేబుల్స్ ద్వారా 20 రౌండ్లలోనే చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఫలితాన్ని ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ మధ్యాహ్నం 3.50 గంటలలోపు పూర్తి అవుతుందని ఆర్వో నిషాంత్‌రెడ్డి తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డితో నేతలు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: 2024 ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. మంగళవారం ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సోమవారం వారు మంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నేటి కౌంటింగ్‌పై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు, బీసీ సెల్ కార్యదర్శి నాగేంద్ర తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా దూరం



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను పూర్తిగా అరికట్టవచ్చని, తద్వారా మలేరియా వంటి జ్వరాలను దూరం చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం బ్యానర్‌ను తిరుపతిలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ శ్రీహరి మాట్లాడుతూ దోమలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రజలు ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఎక్కడా వ్యర్థపునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, తరచూ బ్లీచింగ్ పిచికారీ చేసుకోవడం వల్ల దోమలను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చన్నారు. ఈనెల 35 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మాస్ మీడియా అధికారి బాబు నెహ్రూ రెడ్డి, జిల్లా మానిటరింగ్ సెల్ అధికారులు ఏఎన్ఎంలు, మలేరియా యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న మరోసారి సీఎం కావాలని..



మూలస్థాన ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

– కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న నేతలు

చంద్రగిరి: రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం మంగళవారం నిర్వహించనున్న కౌంటింగ్ ప్రక్రియలో జననేత సీఎం వైఎస్ జగన్ మరోసారి పీఠం అధిరోహించాలంటూ ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో పూజలను నిర్వహించారు. అనంతరం 301 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా యువ నాయకుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తిరుగులేని మెజారిటీతో గెలుపొంది, అతి తక్కువ వయసులో అసెంబ్లీలో అడుగుపెట్టి కొత్త చరిత్రను సృష్టించనున్నారని తెలిపారు. ఒంగోలు ఎంపీగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సైతం సరికొత్త రికార్డుతో విజయదుందుభి మోగించనున్నట్లు తెలిపారు. ఒక్క నాయకున్ని ఎదుర్కోవడానికి కూటమి పేరుతో అన్ని పార్టీలు కలిసి యుద్ధానికి దిగాయని, ఈ రాజకీయ కురుక్షేత్రం జగనన్న అర్జునుడిలా పోరాడి పేదల ప్రభుత్వాన్ని మరోసారి నిలబెట్టనున్నట్లు చెప్పారు. కరోనా లాంటి కష్టకాలంలో ప్రజలకు తోడుగా నిలిచిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెంట నియోజకవర్గ ప్రజలు ఉన్నారని, మంగళవారం నిర్వహించే కౌంటింగ్‌లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గెలుపొంది, చంద్రగిరి కోటపై వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడునుందని తెలిపారు. వరుసగా మూడోసారి వైఎస్సార్‌సీపీ గెలుపొంది హ్యాట్రిక్‌ను సొంతం చేసుకోనున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో సీఎంగా వైఎస్ జగన్ మరోసారి ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం విడుదలయ్యే ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించాలని అమ్మవారికి మొక్కుకుని, కొబ్బరికాయలు కొట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మస్తాన్, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు కొత్తపాటి కోటి, కోలా అనిల్, బండారు హేమచంద్ర, వెంకటయ్య, భాస్కర్, గురుమూర్తి యాదవ్, అంగేరి రాజశేఖర్, మణి తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ జాతర ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో వెలసిన బంగారమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర ప్రారంభమైనట్లు ఈవో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 7వ తేదీ అంబళ్లు, 11న అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు, అలంకారాలు జరుగుతాయన్నారు. 7గంటలకు గెరిక పూజ, 10గంటలకు మైలు ముగ్గు, మధ్యాహ్నం 2గంటలకు పోతురాజు ముగ్గు, సాయంత్రం 4గంటలకు పొంగళ్లు జరుగుతాయన్నారు. 12న ఉదయం 6గంటలకు అభిషేకాలు సాయంత్రం 4గంటలకు కుంభం, రాత్రి 6 గంటలకు అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

ముక్కంటి సేవలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం టీటీడీ ఈవో ధర్మారెడ్డి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద వేదపండితులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గజరాజుపై వేణుగోపాలుడి విహారం



గజ వాహనంపై విహరిస్తున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం: కార్వేటినగరంలోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు సోమవారం రాత్రి గజ వాహనంపై, ఉదయం హనుమంత వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు, భక్తజనుల గోవింద నామస్మరణ, మంగళవాయిద్యాలు, వేద ఘోష నడుమ వాహన సేవలు అంగరంగ వైభవంగా సాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, శాత్తుమొర, మొదటి గంట, బలి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు హనుమంత వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వేదపండితులు ఆలయంలో వేదమంత్రాల తో వసంతోత్సవం, ఆస్థానం నిర్వహించి పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలను చల్లారు. అనంతరం స్వామివార్లను మాడవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయంలో శుద్ధి, తోమాల, రాత్రి గంట చేపట్టారు. అదే విధంగా సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల నడుమ పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలోకి వేంచేపు చేసి, పండితుల వేదమంత్రాల నడుమ ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన సంగీత కచేరీ

టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య ప్రాజెక్టు వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. స్వామివారికి వివిధ రకాలైన భక్తి గీతాలను ఆలపించారు. రాత్రి 7గంటలకు స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గజ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం గజవాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9.45 గంటలకు టీటీడీ వేదపండితులు స్వామివారిని ఏకాంత సేవలో పవళింప చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరిస్తారని ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.





హనుమంత వాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు, ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

వెల్లివిరిసిన సృజనాత్మకత



శిక్షణ పొంది సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్: వేసవి సెలవు నేపథ్యంలో సమ్మర్ క్యాంపులో అభ్యసించిన పిల్లలు వివిధ రకాల ఆటపాటల నైపుణ్య ప్రదర్శనలతో పిల్లల్లోని సృజనాత్మకత వెల్లువిరిసింది. వేమన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని గత నెల రోజుల పాటు యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో పిల్లలకు, మ్యాజిక్, పాటలు, చిత్రలేఖనం, చెస్, కర్రసాము వంటి ఆటల్లో ఉచితంగా శిక్షణ కల్పించారు. సమ్మర్ క్యాంప్ ముగింపు ఉత్సవం సోమవారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు వివిధ కళారూపాల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం పిల్లలు దేశభక్తిగీతాలు, జానపద, శాస్త్రీయ నృత్యాలతో అలరింపజేశారు. కొందరు పిల్లలు మ్యాజిక్ ట్రిక్స్‌లో భాగంగా తలపై మంటలు పెట్టుకునే మ్యాజిక్‌ను ప్రదర్శించి అబ్బుర పరిచారు. చిన్నారులతో పాటు పెద్దలు సైతం కర్రసాము చేసి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రముఖ చిత్రకారులు కిరణ్‌కుమారి, అర్చన, భువనేశ్వరి, గాయిత్రి పిల్లలచే వేయించిన అద్భుత చిత్రాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి జూన్ 2వ తేదీవరకు తాము చేపట్టిన సమ్మర్ క్యాంపులో వివిధ రంగాల్లో నిష్ణాతులైన గురువుల కృషితో పిల్లలు బాగా రాణించారని తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల, ప్రముఖ న్యాయవాది ఎం.పురుషోత్తం, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోము రవికుమార్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న ఆట, పాటలు, మ్యాజిక్ వంటి అద్భుత రీతిలో ప్రదర్శించిన ఆకట్టుకున్న పిల్లలను ప్రశంసించారు. జానపద, శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రతిభ చాటిన పిల్లలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో పిల్లలకు శిక్షణ కల్పించిన గురువులను శాలువ, జ్ఞాపికలు, పుస్తకాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. చిత్రలేఖనం, సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన వారికి జనవిజ్ఞాన వేదిక నేతలు బహుమతులు ప్రదానం చేశారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వేమన విజ్ఞానకేంద్రం ప్రతినిధులు టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, మునిలక్ష్మి, గురునాథం, వెంకటరమణ, రఫీ ప్రతినిధులు పాల్గొన్నారు.



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు



మ్యాజిక్‌ను ప్రదర్శిస్తున్న ఆకట్టుకుంటున్న చిన్నారులు



జానపద నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు